# ఆశయం

ఆ వీధిలో ఆకాశాన్ని చుంబిస్తున్నట్లుగా వున్నాయి ఎన్నో మేడలు. ప్రతి భవంతి అత్యంత ఆకర్షణీయంగా ఎంతో అధునాతనంగా వుంది. ప్రతి బిల్డింగ్ కాంపౌండులో కారో జీపో ఏదో ఒక వెహికల్ పార్కుచేయబడి దాని అందాన్ని, హోదాని యినుమడింపచేస్తున్నది. పెద్దపెద్ద డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు నివసించే ఆ లొకాలిటిలో ప్రఖ్యాత నవలా రచయిత్రి వసుంధరాదేవి కూడా ఓ చిన్న పెంకుటింట్లో వుంటోంది.

ఆ స్ట్రీట్‌లోని బిల్డింగులన్నీ దాటుకుని వసుంధరాదేవి ఇంటి ముందు ఆగిందో ఇంపాలా కారు. మల్లెపువ్వులాంటి తెల్లని డ్రెస్సు, కళ్ళకు గాగుల్సు ధరించిన ఆరడగుల వ్యక్తి కారు దిగి చేతి కర్రను వూపుకుంటూ గేటుతీసుకుని లోపల కెళ్ళాడు.

ఖరీదైన ఆ వ్యక్తిని సాదరంగా లోపలకు ఆహ్వానించింది వసుంధరాదేవి.

"నేను నవశక్తి మూవీస్ నిర్మాతని. నా పేరు వజ్రాలరావు. తనని తాను పరిచయం చేసుకుని కుర్చీలో కూర్చున్నాడు వజ్రాలరావు.

అతడి రాకకు కారణం తెలిసిపోయింది వసుంధరాదేవికి. అప్పటికే ఆమె వ్రాసిన రెండు నవలలు సినిమాలుగా తియ్యబడ్డాయి. ఈయన కూడ అదే పనిమీద వచ్చివుంటాడనుకుంది.

"నేనిక్కడికి ఎందుకు వచ్చానో మీరీపాటికి వూహించే వుంటారు. అయినా నానోటితో నేను చెప్పాలికదా. పాఠక ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన మీ సీరియల్ నవల 'సమాధి' చిత్రీకరించి తెర కెక్కించాలని నిర్ణయించుకున్నాం. అందువల్ల మీరు

కథకు సంబంధించిన హక్కులు......

"మావారిని అడిగి తరువాత చెబుతాను" అన్నది వసుంధరాదేవి అతడి మాట పూర్తి కాకుండానే.

"తొందరేమీలేదు. సంక్రాంతి వెళ్ళాకనే షూటింగు ప్రారంభించాలనుకున్నాం. ఈలోగా మీ అభిప్రాయం.........."

"తప్పకుండా తెలియజేస్తాను."

"సంతోషం. మరి నేను వస్తాను" కుర్చీలోంచి లేచాడు వజ్రాలరావు.

అతడలా బయటకు వెళ్ళాడో లేదో మరో వ్యక్తి లోనికి ప్రవేశించాడు.

చేతులు జోడించి ఖాళీగా వున్న కుర్చీని చూపించింది వసుంధరాదేవి.

నమస్కారం చేసి కుర్చున్నాడా వ్యక్తి.

అతడెవరో, ఎందుకు వచ్చాడో అర్థంగాక అయోమయంగా చూసిందామె.

"నన్ను మీరెరుగరు కదా?"

నీళ్ళు నములుతూ ఔనన్నది వసుంధరాదేవి.

"మా పత్రికలో పాఠకుల ప్రశ్నలకు జవాబులిమ్మనమని అడిగేందుకు మీ దగ్గర కొచ్చాను. మీరు సరేనంటే ఈ వారం నుండి పాఠకుల ప్రశ్నల్ని.........."

"మావారిని అడిగి తరువాత చెబుతాను". అన్నది వసుంధరాదేవి ఠపీమని.

"చాలా సంతోషం. తప్పక మా అభ్యర్ధనని అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. మరి మాకు శలవిస్తే....." చేతులు జోడిస్తూ లేచాడా వ్యక్తి.

అంతలోనే తెల్లని గ్లాస్కో పంచె. పాలిస్టరు కల్లీలాల్చీ, కళ్ళకు దళసరి అద్దాలు ధరించిన మరో వ్యక్తి లోపలకొచ్చాడు. బట్టతల, దబ్బపండులాంటి పచ్చని శరీర ఛాయ, పెద్దపెద్ద కళ్ళు, చూడటంతోనే గౌరవభావం కలిగే వదనం.......

"నమస్కారం" రెండు చేతులూ జోడించింది వసుంధరాదేవి.

ప్రతినమస్కారం చేస్తూ కుర్చీలో కూలబడ్డాడా వ్యక్తి. అతడి రాకకు కారణం వూహిస్తూ అక్కడే నిలబడి దిక్కులు చూడసాగింది వసుంధర.

"నేను 'రథం కదిలింది' దినపత్రిక విలేఖర్ని. మా పత్రిక జన్మదిన సంచికలో ప్రఖ్యాత నవలా రచయిత్రి వసుంధరాదేవిగారితో యింటర్వ్యూ అనే శీర్షిక వుంటుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. అందుచేత మీరు శ్రమ అనుకోకుండా నేనడిగే కొద్ది ప్రశ్నలకి....."

"అడగండి" అన్నదామె నవ్వుతూ.

"థాంక్స్".

ఒకమారు గొంతుక సవరించుకుంటూ "మీ రెక్కువగా ఎవర్ని ప్రేమిస్తారు?" అడిగాడు విలేఖరి.

"ముందు నా భర్తని. తర్వాత దేవుణ్ణి."

"మీరీ స్థితికి ఎదగడానికి ప్రేరణ కలిగించిన వారెవరో తెలియజేస్తారా?"

"మావారు".

"భార్యా భర్తల మధ్య ముఖ్యంగా వుండవలసింది......"

"ఒకరిపై  వొకరికి నమ్మకం."

"అందరూ ప్రేమ అని అంటారు కదా? మరి మీరు వారితో ఏకీభవించారా?"

"ఒకరిపై  ఒకరికి నమ్మకముంటేనే ప్రేమ జనిసిత్తుంది"

"చాలా సంతోషం మరొక్క ప్రశ్న."

"అడగండి."

"మీరు రచనలు చేసి ఎంత సంపాదించినా, ఎంత వున్నతస్థాయి కెదిగినా చాలా సింపిల్‌గా వుంటారు. అందుకు కారణం........"

ఈమారు అతడి ప్రశ్నకు ఆమె మోములో రంగులు మారాయి. కాస్త చిరాగ్గా నొసలు చిట్లిస్తూ "నేను ఆశయం కోసం జీవిస్తున్నాను. ఆ ఆశయం నెరవేరాలంటే నేను సంపాదించే ప్రతి పైసా దాని కెంతో అవసరం." అంది వసుంధరాదేవి.

"ఆ ఆశయమేమిటో....."

"మీరడగకూడదు. నేను చెప్పకూడదు."

"సరే మీ యిష్టం. చాలా థాంక్సండి. మీకెంతో శ్రమయిచ్చాను."

"ఫరవాలేదు."

అతడు వెళ్ళిపోవడంతోనే అందరూ కూడబలుక్కుని వచ్చినట్లుగా మరొకతను లోపలకొచ్చాడు.

నమస్కారం చేసి కూర్చోమన్నది వసుంధరాదేవి. అప్పటికే ఎంతో సేపు నిలబడివుండటం వల్ల. కాళ్ళు పీకడంతో తనూ మరో కుర్చీలో కూలబడింది.

"నన్ను లక్ష్మీపతి అంటారు. ఈ ఊర్లో వున్న సాహితీ సాంస్కృతిక సమితి ఉపాధ్యక్షుణ్ణి.

మావార్షికోత్సవం సందర్భంగా మిమ్మల్ని ఘనంగా సన్మానించాలని సంకల్పించాం. మీరు కాదనరనే వుద్దేశంతో....." వచ్చిన పని వివరించాడు లక్ష్మీపతి.

"మావారిని అడిగి తరువాత చెబుతాను" అంది వసుంధరాదేవి.

"మంచిది. మరి నేనెళ్ళొస్తాను" లేచాడు లక్ష్మీపతి.

ఇంటికి వచ్చిన పెద్దమనుషులందరికీ సమాధానాలు చెప్పి అలసిపోయిన వసుంధరాదేవి బరువుగా వూపిరి పీల్చుకుంది.

"భేష్. మీ పతిభక్తికి మా జోహార్లు." చప్పట్లు చరచి వెటకారమాడుతున్నట్లుగా అంటూ లోపలకొచ్చింది ప్రమీల.

ప్రమీల వసుంధరాదేవి ప్రాణస్నేహితులు. ఆమె వసుంధరాదేవి పొరుగునే వుండటం వల్ల తనకు ఉబుసుపోనప్పుడల్లా వచ్చి రచయిత్రిగారికి సుత్తేయడం ఆమెకు అలవాటు.

"నువ్వెప్పుడొచ్చావే. రా.....కూర్చో......ఈమధ్య మరీ నల్లపూసై పోయావు" నిష్ఠూరంగా పలికింది వసుంధరాదేవి.

"నే నొచ్చి చాలా సేపయింది. నువ్వు వచ్చిన పెద్దమనుషులతో ఏం మాట్లాడుతున్నావో అంతా చాటుగా విన్నాను. నాకు తెలియకడుగుతాను. నీ కంటూ ఒక వ్యక్తిత్వం లేదా?" అడిగింది ప్రమీల బల్లమీద వున్న వారపత్రిక తీసి పేజీలు త్రిప్పుతూ.

"ఎందుకుండదు? నేను మనిషిని కాదా?" ఎదురు ప్రశ్నవేసింది వసుంధర.

"ఉంటే వాళ్ళతో అలాగేనా మాట్లాడేది? వాళ్ళు ఏమడిగినా మా ఆయన్ని అడిగిచెబుతాను. మావారిని అడిగిచెబుతాను.... ఛ...... ఆడవాళ్ళ పరువు తీసేస్తున్నావు." అంది ప్రమీల చీవాట్లు పెడుతున్నట్లుగా.

ఆమె మాటలకు జవాబివ్వలేదు వసుంధరాదేవి. ఆమె మౌనం ప్రమీలను మరింతగా బాధించింది.

"చదువు సంధ్యాలేని కేవలం భర్త దయాదాక్షిణ్యాలమీదే ఆధారపడిన వనిత సహితం వ్యక్తిత్వాన్ని చంపుకోలేదు. అలాంటిది నీ కంటూ సంపాదన, పేరు ప్రతిష్ఠలు వున్న నువ్వు కూడా....."

ఈమారు ప్రమీలవైపు తీక్షణంగా చూస్తూ "నా వ్యక్తిత్వం కోసం మరొకరి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయలేను" అన్నది వసుంధర.

"మాటల గారడీచేసి నీ వాదనను నెగ్గించుకునేందుకు ప్రయత్నించకు. నేను అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పు. మీవారిని సంప్రదించకుండా నీకు నీవుగా ఏ నిర్ణయం తీసుకోకూడదా!.... ఏకార్యక్రమానికి హాజరుకాకూడదా? లేక ఆయనే

నీకు యిటువంటి ఆంక్షలు విధించారా?"

ఆమె ధోరణికి కాస్త కలవరపడింది వసుంధరాదేవి మనసు. ఒక్కక్షణం ఆగి, "నువ్వు చాల పొరబడుతున్నావు. నువ్వెంత స్నేహితురాలివైనా నా గురించి సంపూర్తిగా తెలియదు. ఈనాడు నాకు లభిస్తున్న ప్రశంసల్ని అందుకోవలసిన వ్యక్తి వేరే వున్నారు" అంది వసుంధర నిట్టూరుస్తూ.

ఆశ్చర్యంగా ఆమెవంక చూసింది ప్రమీల.

"చెబుతా విను!" వసుంధరాదేవి చెప్పే మాటల్ని అతిశ్రద్ధగా వినసాగింది ప్రమీల.

"నేను ఇంటర్ పాసవగానే. అక్కడితో చదువు మానిపించేసి పెళ్ళి చేయాలనుకున్నారు మావాళ్ళు. కాకతాళీయంగా విశాఖపట్నం సంబంధం తారసపడింది. పెళ్ళికొడుకు భారత ట్యుటోరియల్ కాలేజీలో పనిచేస్తున్నాడు. జీతం కేవలం నాలుగు వందలు. మావాళ్ళకా సంబంధం నచ్చలేదు. ఐతే మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నేనతనిని చేసుకుంటాననడంతో మా పెళ్ళికి మరే సమస్యా ఎదురవలేదు.

అతను చేసే ఉద్యోగం చిన్నదో పెద్దదో నన్ను మాత్రం ప్రాణప్రదంగా చూసుకుంటారు. అతనికి చిన్నప్పటి నుండి కథలు వ్రాయడం హాబీ. ఎన్నో కథలు, నవలలు వ్రాసి పత్రికలకు పంపేవారు. ఐతే అతడి దురదృష్టమేమిటో మరి పంపిన ప్రతి రచనా క్షేమంగా తిరిగొచ్చేది.

"అనవసరంగా పత్రికలకు కథలు పంపుతూ పోస్టల్ ఛార్జీల నిమిత్తం ప్రతి నెలా యాభై రూపాయలవరకు. వెచ్చిస్తున్నారు. మన లోటు బడ్జెట్టుకు మరింత టేక్సేమో ఆలోచించండి" అన్నానోమారు వుండబట్టలేక. దానికి వారేమన్నారో తెలుసా? నాకు చిన్నప్పటి నుండి కథలు వ్రాయడమంటే ఎంతో సరదా. కనీసం ఒక్క కథైనా పత్రికలో అచ్చయితే చూసి మురిసిపోవాలనుకుంటున్నాను. ఎంత శ్రమపడుతున్నా నా ఆశ నెరవేరడంలేదు. నేను మణులు, మాణిక్యాలు కోరలేదు. పదవులు, అధికారాలు ఏనాడూ వాంఛించలేదు. నాది అతి స్వల్పమైన కోరిక. అది నెరవేరాలని అహర్నిశలూ కృషిసలుపుతున్నాను. ఇది నీ దృష్టిలో దుబారా అనుకుంటే తప్పక మానేస్తాను."

"అప్రయత్నంగా అతని కంటి నుండి నీటి బొట్లు రాలాయి. నా కప్పుడు అతడిపై జాలివేసింది. నేనే సంపాదకురాలినైతే అతడి రచనల్ని పుంఖాను పుంఖాలుగా

అచ్చువేసేయాలన్నంత కోరిక కలిగింది. అందుకే అతని ప్రయత్నాన్ని ప్రతిఘటించలేదు. పైగా అతనికి కాస్త సహకరించాలనుకుని అతని రచనలను ఫెయిర్ చేయడం మొదలుపెట్టాను."

మా దాంపత్య జీవితంలో మరో రెండు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

పది గంటలకు భోంచేసి శ్రీవారు స్కూలుకు వెళ్ళగానే, చేసేందుకు మరో పనేమీలేకపోవడంతో ఉబుసుపోక ప్రక్కింటివారిని పత్రికోమారు ఇమ్మని అడిగి పేజీలు త్రిప్పసాగాను. అంతలో పోస్టుమాను నా చేతికి కవరేదో అందించి వెళ్ళిపోయాడు.

అలవాటు ప్రకారం అతని తిరిగొచ్చిన కథ అయివుంటుందనుకుని కవరు చించాను. ఆశ్చర్యం....నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను. నేను వ్రాసిన కథ 'అనురాగంలో అపశ్రుతి' దీపావళి కథల పోటీలో రెండు వేల రూపాయల ప్రథమ బహుమతి పొందడమేమిటి?..... పొరపాటున పోస్టుమాను ఒకరి ఉత్తరం మరొకరికి యివ్వలేదుకదా?...... కవరు మీదచిరునామా చూసాను సరిగ్గానే వుంది.

ఆ రచన నాదికాదు మహాప్రభోనని అన్నా మావారు వినిపించుకోలేదు. పైపెచ్చు ఊరంతా చాటింపువేసారు. నన్ను అభినందించడానికి మీరంతా గుంపులు గుంపులుగా వచ్చేసారు. నాకు మతిపోయింది. ఆ తర్వాత తెలిసింది. ఆయన తను వ్రాసిన కథని నాపేరున పత్రికకు పంపారని.

నా అదృష్టం మీద నమ్మకమేర్పడిన మావారు వరుసగా కథలు, నవలలు వ్రాసి నా పేరున పంపసాగారు. దాంతో నేనో పెద్ద రచయిత్రినై పోయాను. అభిమానులు కూడా ఎక్కువై పోయారు. వాళ్ళు వ్రాసిన ఉత్తరాలకు కూడా ఆయనే సమాధానాలు వ్రాసిపంపుతారు. ఐతే అతనిపేరు మీద అతను వ్రాసిన ఏ చిన్న కథా ప్రచురణకాకపోవడం నాకెంతో మనస్థాపాన్ని కలిగిస్తోందంటే నమ్ము.

ఆమె చరిత్రను చెవులు రిక్కించి వింటున్న ప్రమీల ఆమెవంక సానుభూతిగా చూస్తూ "అన్నట్లు నువ్వొక ఆశయం కోసం జీవిస్తున్నానన్నావ్. ఆ ఆశయం ఏమిటో చెప్పావుకాదు" అన్నది.

"తప్పకుండా చెబుతాను. నీకంటె నాకు ఆప్తులెవరున్నారు. రచయితగా ఆయన నెంత కృషి చేస్తున్నా. గుర్తింపంతా నాకే లభిస్తోంది. అందుకే 'రవి వెలుగు' అనే వారపత్రిక స్థాపించి ఆయనను సంపాదకునిగా నియమించాలని. ప్రతివారం

పత్రిక మొదటి పేజీలో అతని రచన వుండాలని నా అభిలాష. పత్రికా స్థాపన సామాన్యమైన విషయంకాదు. కనీసం రెండు లక్షల రూపాయలైనా వుండాలి. అందుకే ఈ తాపత్రయమంతా. నేను సంపాదించే ప్రతిపైసా నా ఆశయ సిద్ధికోసమే. త్వరలోనే మా పత్రిక ప్రారంభిపబడుతుందని నీకు ముందుగా, తెలియజేయడానికి నేనెంతో ఆనందిస్తున్నాను" అన్నది వసుంధరాదేవి చెక్కిలిపై జారిన కన్నీటి చారలను పైట చెంగుతో తుడుచుకుంటూ.

*● ఆంధ్ర సచిత్ర వారపత్రిక 23–9–88.●*